


అక్షర జ్ఞానం..!



- అక్షరమాల తెలియని మూడో తరగతి చిన్నారులు
- భాషల్లో వెనకబడ్డ ఆరోతరగతి..
- తొమ్మిదిలో అరకొర పరిజ్ఞానం
- నేర్చుకోవడంపై ఆసక్తి కరువు
- 'పరఖ్' సర్వేలో బయటపడ్డ నిజాలు

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మూడో తరగతి విద్యార్థులు అక్షరమాలలో వెనకబడ్డారు. ఆరో తరగతి పిల్లలు మాతృభాషలోనూ అరకొర జ్ఞానంతో చదువు లాగిస్తున్నారు. 'పరఖ్' సర్వేలో పలు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. విద్యతోనే సమాజ అభివృద్ధి అనే లక్ష్యంగా విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. 'నిర్బంధ విద్య' ద్వారా అందరూ ప్రయోజకులు కావాలని ఉచితంగా మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం కోసం పాలు, కోడి గుడ్డు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ వంటి సదుపాయాలు కల్పిస్తున్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో అనుకున్నంత ఫలితాలు రావడం లేదని తెలుస్తోంది కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత రీతిలో అడ్మిషన్లు సాగడం లేదు. క్రమేపీ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈ నేపథ్యంలో పెర్ఫార్మెన్స్ అసెస్మెంట్, రివ్యూ, అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలెప్‌మెంట్ (పరఖ్) పేరిట జాతీయస్థాయిలో సర్వే జరిగింది. కేంద్ర విద్యాశాఖ నేతృత్వంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 'పరఖ్'జాతీయ సర్వే 2024లో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ప్రత్యేకించి మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యాప్రమాణాలకు సంబంధించి విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. ఇందులో తొమ్మిదో తరగతి విభాగంలో కనీస ప్రదర్శన చూపిన పది రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటిగా ఉంది. 2024 డిసెంబరు 4న జరిగిన సర్వేలో దేశవ్యాప్తంగా 74,299 పాఠశాలల నుంచి 21,15,022 మంది విద్యార్థులను సర్వే చేశారు. ఇందులో 2,70,424 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణితంలో తగ్గిన సామర్థ్యం

బాగలకోటె, హాసన్, ఉత్తరకన్నడ, యాదగిరి జిల్లాలు మూడో తరగతికి ఎంపిక చేశారు. లాంగ్వేజ్, మ్యాథ్స్ సబ్జెక్టులలో మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యం జాతీయ సరాసరికంటే తక్కువగా ఉంది. లాంగ్వేజ్‌లో 60శాతం, మ్యాథ్స్‌లో 57శాతంగా కర్ణాటకగా నమోదైంది. జాతీయ సరాసరి వరుసగా 64శాతం, 60 శాతంగా ఉంది. నగర, గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలబాలికలు కూడా వెనుకబడ్డారు.

ఆరో తరగతిలో వెనుకబాటు

బాగలకోటె, బెళగావి, బెంగళూరు నగర, దక్షిణకన్నడ, హాసన్, కొడగు, ఉడుపి, ఉత్తరకన్నడ జిల్లాల్లో ఆరో తరగతి విద్యార్థుల ప్రతిభా సామర్థ్యంపై సర్వే చేపట్టారు. ఈ జిల్లాల విద్యార్థులు కూడా జాతీయ సరాసరికంటే తక్కువ సామర్థ్యం ఉన్నారు. లాంగ్వేజ్‌లో 55శాతం (జాతీయ సరాసరి 57శాతం), మ్యాథ్స్‌లో 45శాతం (జాతీయ సరాసరి 46శాతం), సైన్స్‌లో 47శాతం (జాతీయ సరాసరి 49శాతం) గా ఉంది. లాంగ్వేజ్ విషయంలో బాలికలు జాతీయ సరాసరి 59శాతాన్ని కలిగి ఉండడం గమనార్హం.

రాష్ట్రంలో సర్వే వివరాలు

తరగతి	పాఠశాలలు	ఉపాధ్యాయులు	విద్యార్థులు
3వ తరగతి	1,359	3,543	31,666
6వ తరగతి	1,298	3,696	32,419
9వ తరగతి	1,562	6,022	43,783

భాషపై పట్టు లేని తొమ్మిదో తరగతి

బాగలకోటె, బెళగావి, బెంగళూరు నగర, దక్షిణకన్నడ, హాసన్, కొడగు, ఉడుపి, ఉత్తరకన్నడ జిల్లాల్లో 9వ తరగతి విద్యార్థులను పరీక్షించారు. లాంగ్వేజ్‌లో 51శాతం, మ్యాథ్స్‌లో 33శాతం, సైన్స్‌లో 37శాతం, సోషల్‌లో 37శాతం సామర్థ్యాన్ని చాటారు. జాతీయ సరాసరి వరుసగా 54శాతం, 37శాతం, 40శాతం, 40శాతంగా ఉంది. తొమ్మిదో తరగతిలో కనీస ప్రదర్శనను చాటిన పది రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటిగా ఉంది.

- సర్వేలో లాంగ్వేజ్, మ్యాథ్స్, సోషల్‌స్టడీస్, సైన్స్ సహా ఏ సబ్జెక్టులోనూ జాతీయ సరాసరి కంటే తక్కువగా రాష్ట్రవిద్యార్థుల సామర్థ్యం ఉండడం ఆందోళన కలిగించే అంశం. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు మెరుగ్గా ఉన్నారు. అయితే కేంద్రప్రభుత్వ పాఠశాలలు కొన్ని జాతీయ సరాసరిని అందుకోగా మరికొన్ని అంతకుమించి సాధన చూపాయి. సర్వే నివేదికలోని అంశాలు ఈవిధంగా ఉన్నాయి. అందులో మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యం కొవిడ్ క్రితం అవధికంటే తక్కువగా ఉన్నట్లు తేలింది. కీలకమైన పాఠశాలల్లోనూ అరకొర చదువులే కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రాథమికంగా అక్షరమాల, అచ్చులు, హల్లులు, గుణింతాలు, ఎక్కాలు, కూడిక, తీసివేత, భాగహారం, గుణించడం వంటి అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెష్..!



- బిహార్ ఎన్నికల దాకా అధిష్టానం మౌనమే ..?
- సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యలపై స్పందన కరువు

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల నేనే సీఎం అంటూ ఢిల్లీ వేదికగా సిద్దరామయ్య సంచలన ప్రకటన చేసినా అధిష్టానం మౌనం వీడలేదు. అంతకుముందు నాయకత్వ మార్పు ప్రస్తావన వస్తూనే అధిష్టానం హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. కానీ ముఖ్యమంత్రి ఢిల్లీలో బహిరంగ ప్రకటన చేసిన తర్వాత ఇటు ఉపముఖ్యమంత్రిగానీ, అటు అధిష్టానం గానీ పైగా రాష్ట్రానికే చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా స్పందించలేదు. మూడు రోజులపాటు సీఎం, డీసీఎంలు ఢిల్లీలో గడిపినా ఇద్దరిలో ఎవరికి కూడా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఇలా అందరూ మౌనంగా ఉండేందుకు ప్రధాన కారణం బీహార్ ఎన్నికల ప్రక్రియేనని తెలుస్తోంది. కాంగ్రెస్ లో అధిష్టానందే అంతిమ నిర్ణయం అనేది తెలిసిన విషయమే. ఎన్నో కీలక సందర్భాల్లో తమ నిర్ణయాన్ని ఎంతటివారిపైనైనా ప్రయోగించిన సందర్భాలు ఉన్నాయి. ఎంతోమంది ముఖ్యమంత్రి, గవర్నర్ పదవులు చివరిక్షణంలో చేజారిన సంగతి కూడా తెలిసిందే. వారి అనుమతి లేకుండా 'నేనే కీలకమంటే...' అంగీకరించే ప్రసక్తే ఉండదు. కానీ సిద్దరామయ్య ఢిల్లీలో రెండురోజులపాటు ఒకే అంశాన్ని పదే పదే వ్యాఖ్యానించినా ఏ విధంగా కూడా స్పందించకపోవడం వెనుక బీహార్ ఎన్నికలు కారణంగా తెలుస్తోంది. ప్రస్తుత దశలో ఏ విధమైన వ్యాఖ్యలు చేసినా రాష్ట్రంలో ఎంతోకొంత గందరగోళం ఏర్పడుతుందనేది తెలిసిందే. ఈ మౌనం మరికొన్ని నెలలు కొనసాగనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. సీఎం ఢిల్లీలో ప్రకటించినప్పుడు బెంగళూరులో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇంటికి హడావుడిగా ఐదారుగురు మంత్రులు ఎందుకు పరుగులు తీశారనేది ఆలోచన కలిగిస్తోంది. రెండు రోజులుగా సీఎంతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నా డీకే శివకుమార్ ముభావంగానే ఉన్నారు. మీడియాతో నాయకత్వ మార్పు విషయంపై స్పందించేందుకు ఆసక్తి చూపలేదు. అయితే ఈ మౌనం మరెంతకాలం కొనసాగుతుందనేది వేచి చూడాలి.

సీఎంకు జాతీయస్థాయిలో మరో హోదా

సీఎం సిద్దరామయ్యకు ఏఐసీసీ ఓబీసీ కమిటీ సభ్యుడిగా నియమించిన అధిష్టానం మరో కీలకమైన హోదాను అప్పగించారు. సీఎం సిద్దరామయ్య ఆతిథ్యంతో ఏఐసీసీ ఓబీసీ సలహామండలి సమావేశం ఈనెల 15న బెంగళూరులో జరగనుంది. ఏఐసీసీ న్యాయ, మానవ హక్కుల విభాగం నవరణలకోసం ఏర్పాటు చేసిన జాతీయ కార్యక్రమానికి సీఎం సిద్దరామయ్యను అధ్యక్షుడిని చేశారు. ఆగస్టు 2న జాతీయస్థాయిలో జరిగే ఈ కార్యక్రమాన్ని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రారంభించనున్నారు. ఏఐసీసీ న్యాయ, మానవహక్కుల విభాగం సభలో పాల్గొనేందుకు సీఎం సిద్దరామయ్య పదిరోజులలోనే రెండుసార్లు ఢిల్లీ వెళ్లే అవకాశం ఉంది. ఈనెల 21నుంచి లోక్‌సభ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో అంతకుముందుగానే సమావేశం నిర్వహించనున్నారు.

ఆర్సీబీ, కేఎస్‌సీఏ పోలీసులే కారణం

- తొక్కిసలాటపై కున్హా కమిషన్ నివేదిక
- సర్కార్‌ను కాపాడేందుకే: కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



ముఖ్యమంత్రికి నివేదిక అందజేస్తున్న జస్టిస్ కున్హా కమిషన్

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాటకు ఆర్సీబీ, కేఎస్‌సీఏ పోలీసులే కారణమని కున్హా కమిషన్ తేల్చింది. న్యాయమూర్తి మైఖేల్ డీ కున్హా నేతృత్వంలోని కమిషన్ శుక్రవారం సీఎం సిద్దరామయ్యకు నివేదిక సమర్పించారు. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన విషయం తెలిసిందే. తొక్కిసలాటకు కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), రాయల్ చాలెంజర్స్ ఆఫ్ బెంగళూరు (ఆర్సీబీ), డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ఏజెన్సీతోపాటు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని నివేదికలో స్పష్టం చేసినట్టు సమాచారం.

ఘటనకు కారణాలివే

నివేదికలో తొక్కిసలాటకు పలు కారణాలు ప్రస్తావించినట్లు తెలుస్తోంది విజయోత్సవాలు జరపడం అసాధ్యమని తెలిసినా అందరూ కలసి నిర్వహించారని ప్రస్తావించారు. బందోబస్తు ఎక్కడా సమగ్రంగా పాటించలేదని, ప్రజలు ఎక్కువమంది విజయోత్సవాలకు వస్తుండగా నియంత్రించకపోవడంతోనే తొక్కిసలాటకు కారణమని నివేదికలో పొందుపరిచారు. వేలాదిమంది ప్రజలు వచ్చినా కేవలం 79మంది పోలీసులను మాత్రమే బందోబస్తుకు కేటాయించారని, అభిమానులకు ఉచితంగా స్టేడియంలోకి ప్రవేశం ఇవ్వడం కూడా కారణమని వారు పేర్కొన్నారు. గేట్ 12 వద్ద తీవ్రమైన పరిస్థితి నెలకొందని, వేలాదిమంది స్టేడియంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతోనే అదుపుతప్పినటుల పేర్కొన్నారు. తొక్కిసలాటకు సంబంధించి నగర పోలీస్ కమిషనర్ సమగ్ర సమాచారం తెలుసుకోలేకపోయినటుల స్పష్టం చేశారు. సాయంత్రం 3.25 గంటలకు తొక్కిసలాట జరగగా కమిషనర్‌కు సమాచారం 5.30 గంటల తర్వాతనే తెలిసినట్టు నివేదికలో పొందుపరిచారు. ఇటువంటి సంఘటనలు క్షణాల్లో ప్రచారం అవుతాయని కానీ ఎందుకు జాప్యం జరిగిందనేది తెలుసుకోలేకపోయారన్నారు. ఇంటెలిజెన్స్ విభాగం పూర్తిగా విఫలమైందని కున్హా తన నివేదికలో పొందుపరిచారు. సీఎం సిద్దరామయ్యకు నివేదిక సమర్పించడంతో తదుపరి ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది ఇంకా ఖరారు కాలేదు. నివేదిక స్వీకరించే సమయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, సీఎం న్యాయ సలహాదారుడు ఏఎస్ పొన్నణ్ణతోపాటు అధికారులు ఉన్నారు. ఈనెల 17న గురువారం కేబినెట్ సమావేశంలో నివేదిక అంశం చర్చించే అవకాశం ఉంది.

అంగీకరించలేం: కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి

తొక్కిసలాటకు సంబంధించి కున్హా కమిటీ నివేదికను అంగీకరించడం సాధ్యం కాదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నారు. శనివారం హుబ్బళ్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన పోలీసు అధికారులు విజయోత్సవాలకు భద్రత సమకూర్చలేమని సూచించినా ఆ ప్రస్తావన లేకుండానే నివేదిక ఇవ్వడం సరికాదన్నారు. కాంగ్రెస్ నేతల ఒత్తిడితోనే సంబరాలు చేశారన్నారు. ప్రస్తుతం పోలీసులపై ఆరోపణలు చేసేందుకు సిద్ధం కావడం సరికాదన్నారు. కమిషన్ ఏర్పాటుకు ముందు ప్రభుత్వం, హైకోర్టు న్యాయమూర్తి నుంచి అనుమతులు పొందలేదని ఈ కారణంతో నివేదికను అంగీకరించడం సాధ్యం కాదన్నారు.

9 గేట్ల నుంచి తుంగభద్ర పరుగులు

- వరద ఉధృతి తగ్గడంతో గేట్లను దించిన అధికారులు
- ఎగువ వర్షాలతో పెరిగే అవకాశం



జలాశయంలో వరద నీరు

బళ్లారి గాంధీనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): గత ఏడాదికంటే ముందుగానే తుంగభద్ర జలాశయం నిండడంతో ఈ నెల 3వ తేదీన క్రస్ట్‌గేట్ల గుండా అదనపు వరద నీటిని దిగువకు వదిలే ప్రక్రియ ప్రారంభించిన బోర్డు అధికారులు గత 10రోజులుగా కొనసాగిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు వరద నీరు వదలగా, 5వ తేదీ నాటికి 72వేల క్యూసెక్కులకుపై వరద నీటి చేరడంతో 21 క్రస్ట్‌గేట్ల గుండా భారీ ప్రమాణంలో నీటిని దిగువకు వదలడంతో నదీతీర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ప్రస్తుతం తుంగభద్ర పై భాగంలో వర్షాలు తగ్గుముఖం పట్టటడంతో క్రస్ట్‌గేట్లను క్రమేణా తగ్గించారు. గత వారం 12 క్రస్ట్‌గేట్ల నుండి వరద నీరు బయటకు వదలగా, శనివారం మధ్యాహ్నం 1గంటల సమయంలో క్రస్ట్‌గేట్ల సంఖ్యను 9కి కుదించారు. ప్రస్తుతం ఒక్కో క్రస్ట్‌గేటు 2.5అడుగల మేర ఎత్తి 2,873 క్యూసెక్కులు చొప్పున దిగువకు 25,857 క్యూసెక్కుల దిగువకు వదులుతునట్లు బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయం 1625.32 అడుగలకు నీరు చేరుకోగా, జలాశయానికి 46,579 క్యూసెక్కులు నీరు చేరుతుండగా, సాగునీటి కాలువలు, క్రస్ట్‌గేట్లతో చేరి మొత్తం 36,026 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 77.54 క్యూసెక్కుల నీరు నిలువ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1605.28 అడుగులకు నీరు చేరుకోగా, నదికి 21,643 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 28.19 క్యూసెక్కుల నీరు నిలువ ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పు చేరుకున్న నేపథ్యంలో పై భాగంలో వర్షాలు పడి అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొన్న నేపథ్యంలో జలాశయానికి మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. నదికి వరద నీరు చేరే ప్రమాణాన్ని దృష్టిలో పెట్టుకుని క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు వదిలే ప్రమాణం ఆధారపడి ఉంటుందని తెలిపారు. జలాశయం భద్రతా దృష్ట్యా 80 టీఎంసీలకు మించి నిలువ చేసే పరిస్థితి లేదన్నారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీఎంటీసీలో ఆన్‌బోర్డ్ సేవలు

- మౌంటెడ్ స్పీకర్ ద్వారా అంధులకు సూచనలు
- ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి



ఆన్‌బోర్డ్ సేవలు కల్గిన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఐటీ సంస్థ కాంటినెంటల్ బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) బస్సుల్లో అంధులకోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌బోర్డ్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 2023లోనే కాంటినెంటల్ సీఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా ఐఐటీ ఢిల్లీ, రైజ్ లైన్స్ ఫౌండేషన్ సాయంతో అంధులు బస్సులలో సులభతరంగా ప్రవేశించేందుకు ఈ పరికరాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ బీఎంటీసీ బస్సుల్లో ప్రయోగాత్మకంగా తొలుత 25 బస్సుల్లో ఈ సేవలు ప్రారంభించామని, ప్రస్తుతం వందకు విస్తరింపచేశామన్నారు. భవిష్యత్తులో 500 బస్సులకు అనుసంధానం చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీలు సంయుక్తంగా ఆన్‌బోర్డ్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఈ పరికరం అంధులకు బస్సు మార్గాల సంఖ్యలను గుర్తించడంతోపాటు మౌంటెడ్ స్పీకర్ ద్వారా ఆడియో సలహాలను ఇస్తుందన్నారు. బస్ డోర్‌ను గుర్తించేందుకు సులువుగా పనిచేయనుంది. కాంటినెంటల్ చైర్మన్ అండ్ సీఈఓ ప్రశాంత్ దొరస్వామి మాట్లాడుతూ అంధులకు సురక్షిత ప్రయాణం అవసరమనే ఏర్పాట్లు చేశామన్నారు. బీఎంటీసీ ఎండీ రామచంద్రన్‌తోపాటు ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ రైజ్ లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణన్ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.



అంధులకు సూచనలివ్వనున్న మౌంటెడ్ స్పీకర్

భీమలింగేశ్వర

వైభవం

- కన్నుల పండువగా రథోత్సవం
- వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన గడేకల్లు



రథోత్సవానికి హాజరైన అశేష భక్త జనం



స్వామి వారి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తెస్తున్న అర్చకులు

అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం గడేకల్లులో వేములవాడ భీమలింగేశ్వర స్వామి మహా రథోత్సవం శనివారం కన్నుల పండువగా సాగింది. స్వామి వారిని ఉదయం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భీమలింగేశ్వరుడికి ప్రీతిపాత్రమైన మద్యాన్ని, మాంసాన్ని నైవేద్యంగా సమర్పించారు. వేడుకల్లో భాగంగా శనివారం తెల్లరుజామున స్వామివారి ఉత్సాయాన్ని ఆలయం వద్ద నుంచి గ్రామ చావిడి వరకూ లాగారు. అర్చకులు, వేద పండితులు సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తిని, సంజమ్మ అవ్వ ఉత్సవ మూర్తిని ఆలయ వీధుల్లో పల్లకిలో ఊరేగించారు. మేళ తాళాల నడుమ ఆలయం ముందు ఉన్న మంటపానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చారు. అనంతరం మహా రథోత్సవం ప్రారంభమైంది. ఆలయం వద్ద నుంచి గ్రామంలోని బొడ్రాయి వరకూ, అక్కడి నుంచి తిరిగి ఆలయం వద్దకు రథాన్ని లాగి.. వేడుకలను ముగించారు. కర్నూలు, బళ్లారి, అనంతపురం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రథోత్సవానికి తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలలో భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. గడేకల్లు గ్రామం భక్తులతో కిక్కిరిసి పోయింది. సీఐలు మహానంది, రాజు, ఎస్ఐలు ఖాజా హుస్సేన్, జనార్దననాయుడు, శివ, నాగస్వామి, మురాహరి, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు వేడుకలలో పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు



నీలాకాశంలో ఎగిరిపోదామా..?

- స్వస్థలాలకు వెళ్లేందుకు సైబీరియన్ పక్షులు సిద్ధం
- పిల్లలకు శిక్షణ ఇస్తున్న తల్లి పక్షులు

వివరాలు 7లో

జైలు స్నేహం.. దొంగ బంధం

- నిత్యానందరెడ్డి ఇంట్లో చొరబడింది పాత నేరగాళ్లు
- ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు
- 20 తులాల బంగారం, కారు, బైకు స్వాధీనం
- ఉత్తరాది ముఠా కోసం గాలింపు
- హిందూపురం డీఎస్పీ మహేష్

6

గడువులోగా ప్రీమియం

చెల్లించాలి

- వాతావరణ బీమాకు 15 వరకే గడువు
- ఫసల్ బీమాకు 31 వరకూ.. వరికి ఆగస్టు 15 వరకు..

పరిశోధక సాధకులకు విశ్వమే వేదిక

» ఇస్రో చైర్మన్ నారాయణన్

7

లోక్ అదాలత్‌లో 788 కేసుల పరిష్కారం | బంగ్లాదేశ్ మహిళను ప్రేమించి జైలుపాలైన బీదర్ వాసి | రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

వివరాలు..7లో

మాకు పని కల్పించొద్దు

వైసీపీ నాయకులకు డీఎస్పీ వార్నింగ్



పోలీసుస్టేషన్ నుంచి బయటకు వస్తున్న వైసీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అతిగా ప్రవర్తించి తమకు పని కల్పించకండని డీఎస్పీ నర్సింగప్ప సోమందేపల్లి వైసీపీ నాయకులను తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. సోమందేపల్లి వైసీపీ ముఖ్యనాయకులను శనివారం డీఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌తో కలిసి డీఎస్పీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 4న సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థులు 30మంది అస్వస్థతకు గురికావడంపై వైసీపీ నాయకుల తీరును డీఎస్పీ తప్పుబట్టారు. విద్యార్థినుల పరామర్శ పేరుతో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, నాయకులు హంగామా చేయడం సరికాదన్నారు. 108 అంబులెన్స్‌ను అడ్డుకోవడం, బైఠాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సవిత పరామర్శకు వచ్చిన సందర్భంలో వివాదాన్ని పెంచడానికి ప్రయత్నించ డంపై డీఎస్పీ మండిపడినట్లు తెలిసింది. నిజానిజాలు తెలుసుకుని నాయకులు ప్రవర్తించాలని, అలాకాకుండా రచ్చ చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని డీఎస్పీ హెచ్చరించినట్లు సమాచారం. కుటుంబాలున్నా యి, అల్లర్లకు పోకుండా, హుందాగా రాజకీయాలు చేసుకోవాలని హితవు పలికినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మృతుడిది కడపజిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి

యాడికి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం యాడికి మండలం దైవాలమడుగు- చందన గ్రామాల మధ్య జరిగింది. ఈ సంఘటనలో కడప జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి (43) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చెర్లోపల్లికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి నంద్యాలజిల్లా ప్యాపిలి వద్ద ఉన్న అరుణాచలేశ్వర ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో 20రోజులకు ఒకసారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండేవాడు. శనివారం ఉదయం విధులను ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. దైవాలమడుగు- చందన గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో విజయభాస్కర్‌రెడ్డి వ్యవసాయ పొలంలోకి ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

టైరు మారుస్తుండగా ప్రమాదం

బస్సు డ్రైవర్ మృతి

గుత్తిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామ శివారు 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండీ మునీర్(48) అనే డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు హైదరాబాద్‌కు చెందిన మునీర్ ఓ ట్రావెల్ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తుండగా శనివారం తెల్లవారుజామున కరిడికొండ గ్రామ శివారులో బస్సు టైర్ పంచర్ అయ్యింది. టైరు మారుస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మునీర్‌ను బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కౌలు రైతు ఆత్మహత్య

ఆరు నెలల కిందట భార్య మృతి

దిక్కులేని స్థితిలో ఇద్దరు బిడ్డలు



రామకృష్ణ(ఫైల్)

కణేకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామానికి చెందిన కౌలురైతు రామకృష్ణ(44) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. రామకృష్ణ గ్రామంలో దాదాపు 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న, సజ్జ, పప్పుశనగ సాగు చేశాడు. పంటలు సక్రమంగా పండక రూ.4 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఆయన భార్య ఎల్లమ్మ వైద్యానికి మరో రూ.3 లక్షలు అప్పుచేశాడు. ఆమె ఆరునెలల క్రితం మృతిచెందారు. దీంతో మానసికంగా కుంగిపోయిన రామకృష్ణ, అప్పుల ఒత్తిడిని భరించలేకపోయాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తన ఇంట్లో విషపు గుళికలు మింగాడు. బంధువులు ఆయనను కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణ మృతితో అతని కూతురు బేబి, కుమారుడు విష్ణు దిక్కులేనివారయ్యారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగమధు తెలిపారు.

కొడుకులు ప్రయోజకులు కాలేదని..!

ఉరవకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సిమెంట్ ఇటుకల వ్యాపారి హజరతయ్య(55) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేశ్వర థియేటర్ సమీపంలో ఉంటున్న హజరతయ్య సిమెంట్ ఇటుకలు, రింగుల వ్యాపారం చేసేవాడు. ఆయనకు భార్య రాజమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిలో కుమారుడు, కూతురుకు వివాహం జరిగింది. మిగిలిన ఇద్దరు కుమారులు ప్రయోజకులు కాలేదని దిగులుపడేవాడు. తన ఆరోగ్యం కూడా సరిగాలేదని హజరతయ్య మనస్తాపం చెందాడు. ఈ క్రమంలోనే అనంతపురం బైపాస్ రోడ్డులోని సిమెంట్ ఇటుకలు తయారు చేసేచోట ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత గమనించిన స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం

విజయనగరం కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు

యాడికి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఫిలిప్పిన్స్ దేశంలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని చెప్పి, డబ్బులు తీసుకొని మోసగించిన విజయనగరానికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకులపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యాడికికి చెందిన యజ్ఞానిబాషా తన కుమార్తెకు ఫిలిప్పిన్స్‌లో ఎంబీబీఎస్ సీటు కోసం 2022లో విజయనగరానికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకులు గణేష్, రామారావులకు రూ.3,30,000 చెల్లించాడు. వారు ఎంబీబీఎస్ సీటు ఇప్పించకుండా కాలయాపన చేశా రు. డబ్బు చెల్లించి రెండేళ్లు గడిచినా సీటు ఖరారు చేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు యజ్ఞానిబాషా కన్సల్టెన్సీ నిర్వాహకులను నిలదీశాడు. దీంతో వారు రూ.1.25 లక్షలు తిరిగి చెల్లించారు. మిగతా డబ్బు తర్వా త ఇస్తామన్నారు. రోజులు గడిచినా అతీగతీ లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యా దు చేశాడు. ఆ మేరకు కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏఎన్ఎంలకు నేడు రీ కౌన్సెలింగ్

అనంతపురం వైద్యం, జూలై 12(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఏఎన్ఎంలకు గత నెల 30న నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ రద్దు నేపథ్యంలో ఆదివారం రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ ఈబీ దేవి శనివారం తెలిపారు. గతంలో మాదిరే ఆన్‌లైన్ ద్వారా బదిలీలు నిర్వహిస్తామన్నారు. సీనియార్టీ ప్రకారం ఉద్యోగులు కోరుకునే సచివాలయాలను కేటాయిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఏఎన్ఎంలు ఆయా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల డాక్టర్లతోపాటు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.



సభా వేదికపై పూర్వవిద్యార్థులు

మళ్లీ చదువులమ్మ ఒడిలో..!

కొడిగెనహళ్లిలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హాజరైన తెలంగాణ చీఫ్ సెక్రటరీ, పీవీ కుమార్తె

పరిగి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభివాణి, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చీఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశా ల ఆవరణలో గురుకులాల రూపకర్త అయిన పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులు పరేడ్ డ్రిల్‌తో అతిథులు, పూర్వ విద్యార్థులను స్వాగతించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు మాట్లాడుతూ 1976లో తన తాతగారితో కలిసి ఈ పాఠశాలకు అడుగుపెట్టినట్లు తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి 1979లో పదో తరగతిలో 560 మార్కులు సాధించినట్లు తెలిపారు. తాను నేడు ఈ స్థానంలో ఉండటానికి కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో చదవడమే కారణమని తెలిపారు. అనంతరం పీవీ కుమార్తె సురభివాణి మాట్లాడుతూ తన తండ్రి ప్రతి ఇంటిలో పిల్లలు విద్యనభ్యసించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రంలో మూడు చోట్ల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.



పూర్వ విద్యార్థులైన ఉన్నతాధికారులకు విద్యార్థుల గౌరవ వందనం

అందులో కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ఒకటన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌గా మారి దేశానికి సేవలందిస్తున్నార న్నారు. గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల తరఫున వచ్చే సంవత్సరంలో పదో తరగతి మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.10లక్షలు బహుమతి అందజేస్తామని తెలంగాణా ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో కలియదిరిగి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నంతరం స్నేహితులతో కలిసి విందు ఆరగించారు. పీఓ కిష్టప్ప, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంఈఓ లక్ష్మీదేవి, శేషాచలం, మాజీ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, పూర్వవిద్యార్థులకు ప్రస్తుత విషయాలను వివరించారు.

గడువులోగా ప్రీమియం చెల్లించాలి

వాతావరణ బీమాకు 15 వరకే గడువు

ఫసల్ బీమాకు 31 వరకూ.. వరికి ఆగస్టు 15 వరకు..

జేడీఏ ఉమా మహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకే గడువు ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ పంటలను మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. ఈ ఏడాది జూలై 1 వతేదీ నుంచి వచ్చే ఏడాది మే నెలాఖరు దాకా అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రత పరిణామాలను మండల స్థాయిలో లెక్కించి.. బీమాను వర్తింపజేస్తారని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా కోసం కంది, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలకు ఈ నెల 31లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. వరి పంటకు ఆగస్టు 15వరకు అవకాశం ఉందని తెలిపారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో రైతులు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. బ్యాంకులో పంట రుణం పొందిన రైతులకు రుణం నుంచి ప్రీమియం సొమ్మును బ్యాంకు సిబ్బంది జమ చేస్తారని తెలిపారు. నోటిఫికేషన్‌కు ముందే బ్యాంకు రుణం తీసుకున్న రైతులు తమ ఖాతా నుంచి ప్రీమియం సొమ్ము చెల్లించాలని సంబంధిత బ్యాంకు అధికారులకు వినతి పత్రం అందించాలని సూచించారు. రుణం తీసుకోని రైతులు స్వతహాగా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఆధార్, భూమి పత్రాలు, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డు అవసరమని తెలిపారు. రైతు డిక్లరేషన్ లేని పక్షంలో, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్ఎస్‌కే సిబ్బందితో తీసుకోవాలని కౌలు రైతులకు సూచించారు. ఈ పంట నమోదు చేసుకున్న పత్రం, సెల్ నంబర్, రైతు సేవింగ్ ఖాతా వివరాలు కూడా నమోదుకు అవసరమని తెలిపారు.

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు

పంట పేరు	బీమా మొత్తం (హెక్టార్‌కు)	రైతు చెల్లించాల్సిన మొత్తం ఎకరాకు	హెక్టార్‌కు	గడువు తేదీ
వేరుశనగ	80000	640	1600	జూలై 15
పత్తి	95000	1140	1600	జూలై 15
దానిమ్మ	187500	3750	9375	జూలై 15
చీనీ	137500	2750	6875	జూలై 15
టమోటా	80000	1600	4000	జూలై 15
అరటి	150000	3000	7500	జూలై 15

దమ్మuంటే ప్రజల్లోకి రండి

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూలై 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఐదేళ్ల అరాచక పాలనతో వేలాది కుటుంబాలను వీధుల పాలుచేసి, వేలకోట్లు దోచుకున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. వారికి దమ్ము, ధైర్యం ఉంటే ప్రజల్లోకి రావాలని సవాలు విసిరారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజల్లో కృతజ్ఞతాభావం కనిపిస్తోందని అన్నారు. ఐదేళ్ల దోపిడీ రాజ్యం పీడపీడిందని అన్ని వర్గాల ప్రజలు, రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు చంద్రబాబు మేనిఫెస్టోపై ప్రజల్లోకి వెళ్తామని వైసీపీ పేర్కొనడం వారి దగాకోరు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. మద్యం కుంభకోణం ద్వారా వేలాది పేదల జీవితాలతో ఆడుకున్నారని, వారి రక్తం తాగిన నరరూప రాక్షసులని దుయ్యబట్టారు. రాయదుర్గం నియోజకవర్గ భవిష్యత్తును కాలరాసిన చరిత్రహీనులు వైసీపీ వారేనని అన్నారు. ఐదేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి నేడు ప్రజల్లోకి ఏ ముఖం పెట్టుకొని వెళతారని ప్రశ్నించారు. వైసీపీ పాలకుల బాధితులు వేలాది మంది ఉన్నారని, ప్రజల్లోకి వెళ్తే వారే చొక్కా పట్టుకుని నిలేస్తారని అన్నారు.

చర్లపల్లి-ధర్మవరం మధ్య

ప్రత్యేక వీక్లీ రైలు

గుంతకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని క్లియర్ చేయడానికి ధర్మవరం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 24వ తేదీ వరకూ ప్రతి ఆదివారం ఈ రైలును నడుపుతామని తెలిపారు. చర్లపల్లిలో ఆదివారం సాయంత్రం 7-55 గంటలకు నంబర్ 07003 రైలు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 3 గంటలకు ధర్మవరం చేరుతుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు వీక్లీ రైలు (నం. 07004) ఈ నెల 14వ తేదీ నుంచి ఆగస్టు 25వ తేదీ వరకూ సోమవారాలలో సాయంత్రం నాలుగున్నరకు ధర్మవరంలో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం ఆరున్నర గంటలకు చర్లపల్లికి చేరుకుటుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైలు నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి, కదిరి మీదుగా ధర్మవరం చేరుకుంటుందని తెలిపారు.

జైలు స్నేహం.. దొంగ బంధం

నిత్యానందరెడ్డి ఇంట్లో చొరబడింది పాత నేరగాళ్లు

ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు

20 తులాల బంగారం, కారు, బైకు స్వాధీనం

ఉత్తరాది ముఠా కోసం గాలింపు

హిందూపురం డీఎస్పీ మహేష్



పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న సొమ్ముతో పోలీసులు

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాత కేసుల్లో కర్ణాటక పోలీసులకు పట్టుబడిన ఉత్తరాది ముఠాతో అన్నమయ్య జిల్లాకు చెందిన పాత నేరస్థుడికి పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతోనే గత నెల 26న హిందూపురం మండలం కిరికెర పంచాయతీ వెంకటాద్రి లే అవుట్‌లో దోపిడీ చేశారు. నిత్యానందరెడ్డి ఇంట్లోకి చొరబడి, కత్తులు, తుపాకీ బెదిరించి హల్‌చల్ చేశారు. ఎవరినో చంపేందుకు వచ్చి, పొరపాటున ఆ ఇంట్లో దూరినట్లు మాట్లాడుకుని, బురిడీ కొట్టించాలని చూశారు. కానీ పోలీసులకు చిక్కిపోయారు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు వివరాలను డీఎస్పీ మహేష్ విలేకరులకు శనివారం వివరించారు. మదనపల్లి తాలూకా చిన్నతిప్పసముద్రం గ్రామానికి చెందిన షేక్ ఖాజాపీర్ ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. వ్యసనాలకు బానిసై, డబ్బుల కోసం కర్ణాటక, ఏపీలోని పలుచోట్ల దొంగతనాలు చేశారు. ఇతనిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నాయి. కర్ణాటకలో నమోదైన ఓ కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేసి, చిక్కబళ్లాపుర సబ్‌జైలులో ఉంచారు. అక్కడే ఉత్తరాది ముఠాతో ఖాజాపీర్‌కు పరిచయం ఏర్పడింది. వీరందరూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జైలు నుంచి బయటకు వచ్చారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేశారు. గత నెల 26న హిందూపురం మండలం వెంకటాద్రి లే అవుట్‌లో నిత్యానందరెడ్డి ఇంట్లోకి చొరబడ్డారు. అందరినీ బంధించి, బంగారు ఆభరణాలను దోచుకున్నారు. తాము ఎవరినో చంపడానికి వచ్చామని, ఎమ్మెల్యే కొడుకు అడ్రస్ సరిగా ఇవ్వలేదని మాట్లాడుకున్నారు. ఇదంతా ఉత్తిదేనని పోలీసులు తేల్చారు. కేసు దర్యాప్తు కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. హిందూపురం ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఖాజాపీర్ శనివారం పట్టుబడ్డాడని తెలిపారు. ఇతన్నుంచి 201 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో చిలమత్తూరు పోలీస్‌స్టేషన్, హిందూపురం వన్‌టౌన్, టూటౌన్, హోస్పేట, అర్సిగెరె ప్రాంతాలలో చోరీ చేసిన బంగారం ఉందని తెలిపారు. నిత్యానందరెడ్డి ఇంట్లో 12 తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారని, ఇందులో ఉత్తరాది ముఠా 7 తులాలను తీసుకెళ్లిందని తెలిపారు. మిగిలిన ఐదు తులాల ఆభరణాలు, నేరానికి వినియోగించిన ఐ-20 కారు, ఒక ద్విచక్రవాహనాన్ని ఖాజాపీర్ నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దోపిడీలో ఐదుగురు పాల్గొన్నారని, మిగిలిన నలుగురి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్ అహ్మద్‌ను డీఎస్పీ అభినందించారు.

'అనంత' వేదికగా రాష్ట్ర మహాసభలు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి



మాట్లాడుతున్న దయా రమాదేవి

అనంతపురం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 13, 14వ తేదీలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి వెల్లడించారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన మహాసభల సన్నాహక సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మధ్యాహ్న భోజన పథకం పేరు మార్పు చేయడంతోపాటు మెనూ మార్చారే తప్ప కార్మికుల బతుకులు మారలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు, బిల్లులు వెంటనే చెల్లించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20లు చొప్పున మెనూ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నింటిపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఐక్య ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు రమణయ్య, నాయకులు పద్మావతి, ఓసూరమ్మ, శివలింగమ్మ, మంజుల, రాజేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సనాతన ధర్మం ప్రమాదకరం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమానత్వం ఇంకా రాని నేపథ్యంలో పాలకులు సనాతన ధర్మాన్ని అనుసరిద్దామంటూ చెబుతుండటం ప్రమాదకరమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను అక్టోబరు 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. సమాజంలో రోజురోజుకీ మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. రాష్ట్ర మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకోవడంతోపాటు వివిధ అంశాలపై చర్చలు సాగుతాయన్నారు. ఆహ్వాన సంఘం ప్యాట్రన్స్ ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీల పరిస్థితులు గతం కంటే నేడు మెరుగ్గా ఉన్నప్పటికీ పూర్తిగా మహిళా స్వేచ్ఛ, సమానత్వం రాలేదన్నారు. ఐద్వా ఆహ్వానసంఘం కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా చేపట్టిన ఉద్యమాల్లో మేధావులు, రచయితలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షు రాలు డాక్టర్ అరుణ, అధ్యక్షురాలు గాజుల పద్మజ, ప్యాట్రన్స్ వీకే పద్మావతమ్మ, రవికాంత్ రమణ, ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, డాక్టర్ బాలాకుమారి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ మాధవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో రూ.20వేలు చోరీ

పెనుకొండ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండులో శనివారం చోరీ జరిగినట్లు బాధితుడు మురళీమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెనుకొండ ఆర్టీసీ బస్టాండులో అనంతపురం బస్సు ఎక్కే సమయంలో తన భార్య సుచిత్ర వద్ద ఉన్న రూ.20వేలను దొంగిలించారన్నారు. అయితే టిక్కెట్ కొనేందుకు పర్సు తీసి చూడగా డబ్బు కనిపించలేదన్నారు. అనంతపురంలో డెంటల్ డాక్టర్‌వద్దకు పరీక్షల కోసం నగదును తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో తాన డబ్బు చోరీ అయినట్లు సుచిత్ర తన భర్త మురళీమోహన్, కొడుకు రాఘవకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆర్టీసీ బస్టాండులో ఆరాతీశారు.

కాయ కష్టానికి ధర ఏదీ ?

అనంతపురం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అనంత మార్కెట్‌కు చీనీ కాయలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. గత మూడు నాలుగురోజుల నుంచి పన్నెండు వందల టన్నులకు పైగానే కాయలు వచ్చాయి. అయితే ధరలు లేకపోవడం రైతులను కలవరపెడుతోంది. టన్ను గరిష్ఠ ధర రూ.20వేల లోపే ఉంది. సీజనల్ కాయలు మార్కెట్‌కు ఎక్కువగా వస్తుండటంతో ధర పలకడంలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఎగుమతులు తగ్గిపోవడం కూడా ధరల పతనానికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం 1258 టన్నుల సీజనల్ కాయలు మార్కెట్‌కు వచ్చినట్లు యార్డు ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. గరిష్ఠంగా టన్ను రూ.18360, సరాసరి రూ.12,500, కనిష్ఠ ధర రూ.3వేలతో అమ్ముడుపోయాయన్నారు.

ఇంకేం చేస్తారు

• వర్షాభావంతో పత్తి పంటను దున్నేస్తున్న రైతులు



పత్తిపంటను తొలగిస్తున్న రైతు వాసుదేవరెడ్డి

యాడికి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌ను వర్షాభావం వెంటాడుతోంది. దీంతో అరకొర వానకు సాగు చేసిన పత్తి విత్తనాలు మొలకెత్తక పోవడం, మొలకెత్తినవి ఎండిపోతుండటంతో రైతులు వాటిని తొలగించే పనిలో పడ్డారు. మండలంలోని తిరుణాంపల్లి గ్రామం వద్ద వాసుదేవరెడ్డి అనే రైతు శనివారం తన ఐదున్నర ఎకరాల పొలంలో సాగు చేసిన పత్తిపంటను ట్రాక్టర్‌తో దున్నేస్తూ కనిపించాడు. ముందస్తు వర్షాలకు ఐదున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు రైతు తెలిపారు. సేద్యాలు, విత్తనం తదితర ఖర్చులు కలిపి ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు చేశానన్నారు. పత్తి విత్తనం సరిగా మొలకెత్తలేదని తెలిపారు. విత్తు తర్వాత వర్షం పడకపోవడంతో మొలకలు కూడా ఎండిపోతుండటంతో దిక్కుతోచక దున్నేస్తున్నట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తిరుణాంపల్లి, చిక్కేపల్లి, నిట్టూరు, వీరారెడ్డిపల్లి, కమలపాడు గ్రామాల్లో పత్తి సాగు చేసిన రైతుల అందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇప్పటికే పదుల సంఖ్యలో రైతులు వందల ఎకరాల్లో పత్తి పంటను తొలగించారు. ఈ ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించినా రైతులకు ఎటువంటి సహాయక చర్యలు అందలేదు.


విజేత అనంత

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు గెలుపొందింది. నాలుగో రౌండ్ సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలు స్థానిక అనం త క్రీడాగ్రామంలో శనివారం ముగిశాయి. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య పోటీ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 267 పరుగులకు ఆలౌట్ కాగా కర్నూలు 178పరుగులకే కుప్పకూలింది. 89 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం 293 పరుగుల లక్ష్యం తో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూ లు 255 పరుగులకు ఆలౌట్ అయ్యి పరాజయం పాలైంది. అనంతపురానికి బౌలర్ కమిల్ 7 వికెట్లు పడగొట్టాడు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి విజేత జట్టును అభినందించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

వైరముత్తు (పుట్టినరోజు)



తమిళసాహిత్యంలో రాణించి 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్న వైరముత్తు రామస్వామి 1953 జూలై 13న మధురై ప్రాంతంలో వైగై (ప్రస్తుతం థేని జిల్లా వడుగపట్టి)లో జన్మించారు. ఐదు దశాబ్దాలలో సినీ కెరీర్‌లో 7,500 కుపైగా పాటలు రాశారు. ఏడు జాతీయ అవార్డులు, పద్మశ్రీ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ అవార్డు వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. ఆయన రచించిన పద్యాలు, నవలలు తమిళం నుంచి ఇతర భాషలలోకి అనువాదమయ్యాయి. వక్తగా కూడా రాణించారు. ట్రస్టు ద్వారా పేద పిల్లల విద్యాభ్యాసానికి చేయూత ఇస్తున్నారు.

పొరపాటున పిన్ను మింగిన మహిళకు శస్త్రచికిత్స

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ చేసేవేళ ఓ గుండుపిన్నును నోటిలో పెట్టుకున్న మహిళ పొరపాటున మింగేశారు. పిన్ను శ్వాసకోశంలో చేరుకుంది. బెంగళూరుకు చెందిన సదరు మహిళ ఊపిరాడడం కష్టమై దాదాపు నెలరోజులుగా వివిధ ఆసుపత్రులలో చికిత్సలు పొందారు. చివరకు ఆస్టర్ సీఎంఐ ఆసుపత్రిలో చేరారు. అక్కడి వైద్యులు బ్రాంకోస్కోపిక్ సాంకేతిక విధానం ద్వారా గుండుపిన్నును తొలగించారు. ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజీ సీనియర్ అడ్వైజర్ డాక్టర్ సునిల్‌కుమార్ శస్త్రచికిత్స చేశారు. బ్రాంకోస్కోపిక్ సమయంలో సురక్షితంగా బయటకు తీయగలిగారు. ప్రస్తుతం మహిళ కోలుకున్నారని డాక్టర్ తెలిపారు. ఆస్టర్ సీఎంఐ ఆసుపత్రి సీఈఓ ఎస్‌జీఎస్ లక్ష్మణన్ మాట్లాడుతూ వైద్యుల అపార అనుభవంతోపాటు సాంకేతిక పరికరాలతో మహిళకు చికిత్సలు అందించామన్నారు. గుండుపిన్నును వాడే సమయంలో జాగ్రత్త ఉండాలని సూచించారు.

ప్రమాదంలో విద్యార్థిని మృతి

చింతామణి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార అవుట్‌పోస్ట్ పరిధిలో కైవార - ముత్తుకదహళ్ళి రోడ్డు జీకే రిసార్టు సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని శిరిషా (16) చికిత్స ఫలించక కోలారు ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి కన్నుమూసింది. కోలారు తాలూకా అమ్మనల్లూరు గ్రామానికి చెందిన శిరిషా కైవార క్రాస్‌లోని భైరవేశ్వర పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం రాత్రి యథాప్రకారం శిరిషాను పిన్నమ్మ శ్వేతా తన ద్విచక్ర వాహనంపై పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తుండగా ఎదురుగా తళగవార గ్రామానికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీ కొన్నాడు. ప్రమాదం ధాటికి రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. గాయపడ్డ శ్వేతా, శిరిషాలను స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కోలారు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక శిరిషా కన్నుమూసింది. శనివారం స్వగ్రామం అమ్మనల్లూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సంతాప సూచకంగా సెలవు ప్రకటించింది.

గోడ కూలి గర్భిణి మృతి

రాయచూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా కాతరకి గ్రామంలో పాత గోడ ఒకటి కూలి పోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఆరు నెలల గర్భిణీ మృత్యువాతపడింది. కాతరకి గ్రామానికి తాయమ్మ(35) ఎప్పటి లాగానే ఇంట్లో నిద్రిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి వేళ మట్టిగోడ కూలిపడడంతో ఆమె అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఆమె పక్కనే నిద్రిస్తున్న మరో బాలిక సుమిత్రకు కాలు విరిగిపోగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థళాన్ని పరిశీలించిన మాన్వి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సంఘటన తెలుసుకున్న మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుంటాన్ని పరామర్శించారు.

సిలిండర్ పేలి చెలరేగిన మంటలు

రాయచూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మస్కి తాలూకా ఎస్.బుదిన్ని గ్రామంలోని హోటెల్‌లో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఎదావిధిగా హోటెల్ యజమాని వీరయ్య స్వామి తమ హోటెల్‌ను ఉదయమే ప్రారంభించగా కొద్దిసేపు వ్యాపారం అనంతరం ఒక్కసారిగా సిలెండర్ పేలడంతో హోటెల్ అంతా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో హోటెల్‌లో దాదాపు 15 మంది కస్టమర్లు ఉండగా సిలెండర్ భగ్గుమని అంటుకోవడంతో ఒక్క సారిగా అందరూ అక్కడి నుంచి బయటికొచ్చేశారు. మంటలు రేగి దాదాపు రూ.1.50లక్షలు విలువ చేసే వంట సరుకులు రూ.12 వేలు నగదు కాలిపోయినట్లు హోటెల్ యజమాని వీరయ్య స్వామి తెలిపారు. హోటెల్ నడుపుతూ జీవనం సాగిస్తున్న వీరయ్య స్వామి ఒక్కసారిగా జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోవడాన్ని గమనించిన ప్రజలు ప్రభుత్వం ఆయనను ఆదుకోవాలని కోరారు.

మహిళా పారిశ్రామికవేత్తలు సాంకేతికత పెంచుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్నవారితో ఉబుంటు బృందం

● మాజీ డిప్యూటీ మేయర్ హేమలత గోపాలయ్య

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మహిళా పారిశ్రామికవేత్తలు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని మాజీ డిప్యూటీ మేయర్ హేమలత గోపాలయ్య తెలిపారు. ఉబుంటు బృందంచే హెచ్‌డీఏ మోటార్స్ సహకారంతో మహిళా పారిశ్రామికవేత్తలకు నైపుణ్యతపై రెండు రోజుల జాతీయస్థాయి శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీపై మహిళ లకు శిక్షణలు ఇవ్వడం అభినందనీయమన్నారు. మహిళలు ఇంటి పనులకు మాత్రమే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందాలన్నారు. మహాలక్ష్మీ లేఅవుట్‌లో 4,500 మహిళాసంఘాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ఉబుంటు వ్యవ స్థాపకు లు రత్నప్రభ మాట్లాడుతూ కొవిడ్ వేళ మహిళా పారిశ్రామికవేత్తలకు తీరనినష్టం కలిగిందన్నారు. ఆన్‌లైన్‌లో కూడా వందమంది మహిళలు నైపుణ్య శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 3300మంది మహిళలకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించామన్నారు. ఆగస్టు 1నుంచి 3వరకు అంతర్జాతీయ స్థాయిలో అగ్రి టెక్నాలజీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నా మన్నారు. లెగ్‌షిప్ సీఈఓ పద్మనాభం బాబుతో పాటు డీజీఎఫ్‌టీ ఢిల్లీ జాయింట్ డైరెక్టర మొయిన్ అఫాక్, రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్ సునిల్‌కుమార్, రాజన్ సుదేశ్ రత్న, ఉబుంటు కార్యదర్శి జ్యోతి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలకు ప్రాధాన్యం

● రాయల్ పబ్లిక్‌స్కూల్ వ్యవస్థాపకులు దేవరాజ్



అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

శిడ్లఘట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): బాల్యంనుంచి విద్యతోపాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాయల్ పబ్లిక్‌స్కూల్ వ్యవస్థాపకులు దేవరాజ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బూదాళలోని పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు తమ పాఠశాల కృషి చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ భాస్కర్ మాట్లాడుతూ మన హిందూ ధర్మంలో ఎన్నో పద్ధతులు ఉన్నాయని నామకరణం, అన్నప్రాశన, అక్షరా భ్యాసం ఇలా ఉన్నాయన్నారు. ఇందులోభాగంగా ఎల్‌కేజీ విద్యార్థులకు తల్లిదండ్రులచే అక్షరాభ్యాసం చేయించడం ద్వారా బోధనలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అర్చకులు వైఎన్ దాశరథి ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీలతో మెరుగైన ఫలితాలు

● మెడికవర్ ఆసుపత్రి చీఫ్ కృష్ణమూర్తి



మీడియాతో వైద్యబృందం

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ వంటి సాంకేతికమైన విధానాలతో సర్జరీలు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని మెడికవర్ ఆసుపత్రి చీఫ్ కృష్ణమూర్తి తెలిపారు. వైట్‌ఫీల్డ్ మెడికవర్ ఆసుపత్రిలో ఐదు నెలల అవధిలో వంద రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతం అయ్యాయన్నారు. జనరల్ ఆపరేషన్‌లు యూరాలజీ, గైనికాలజీ, జీర్ణాంగ వ్యవస్థకు సంబంధించిన సర్జరీలు చేశామన్నారు. రోబో టిక్ ఆపరేషన్‌లు నిర్వహించడం ఏమీ సులభతరం కాదన్నారు. నేరుగా సర్జన్ ఆపరేషన్ చేయకపోయినా పర్యవేక్షణ కీలకమ న్నారు. ఆసుపత్రిలో ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ప్రమోద్, జావేద్ హసేన్, కౌశిక్ సుబ్రమణియన్, మానసారెడ్డి, సబిహా, సంస్కృతి రెడ్డిలు ఉన్నారన్నారు. వంద రోబోటిక్ సర్జరీలు విజయ వంతంపై ఆసుపత్రిలో ప్రత్యేక సంబరం నిర్వహించినట్టు తెలిపారు.

పరిశోధక సాధకులకు విశ్వమే వేదిక



ఇస్రో చైర్మన్ నారాయణన్‌కు సన్మానం

▸▸ ఇస్రో చైర్మన్ నారాయణన్

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పరిశోధక సాధకులకు విశ్వమే వేదిక కానుందని విద్యార్థులు ఆధునాతన సాంకేతికతను అలవరుచుకోవాలని ఎప్పటికప్పుడు పరిశోధనలవైపు దృష్టి సారించాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ అభిప్రాయపడ్డారు. ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో ఐఈఈఈ అంతర్జాతీయ సమ్మేళనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కన్యాకుమారి నుంచి ఇస్రో చైర్మన్ దాకా వచ్చేందుకు ఎంతోమంది మార్గదర్శకుల సహకారం ఉందన్నారు. 1969లో ఇస్రో ప్రారంభమైందని ఐదు దశాబ్దాలలో ప్రపంచమే అంతరిక్షపరిశోధనలలో భారతవైపు చూసేలా సాధనలు చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి నేత అని వికసిత భారత్ 2047 లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అంతర్జాతీయ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 14మంది పరిశోధనాపత్రాలన సమర్పించడం సంతోషమన్నారు. ప్రెసిడెన్సీ చాన్స్‌లర్ డాక్టర్ నిస్సార్ అహ్మద్, ఎన్ఐటి పుదుచ్చేరి డైరెక్టర్ డాక్టర్ మకరంద మాధవ్, ఘంగ్రేకర్ తదితరులు పాల్గొన్నారు. 300 అత్యుత్తమ పత్రాలను సదస్సుకు ఎంపిక చేశారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలతో విద్యార్థులు, సంఘం పదాధికారులు

ముళబాగిలు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులలో ఎంత ఒత్తిడితో ఉన్నా తమ పిల్లల విద్యాభ్యాసం పట్ల చొరవ చూపాలని తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఎన్ అరవిందగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని గురుభవనంలో తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల పిల్లలకు శనివారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించినవారికి ప్రోత్సాహకాలు అందచేశారు. హాసన్ ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల సహాయక ప్రాధ్యాపకులు శంకరప్ప మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో జ్ఞానం పొందడం ద్వారా బహుముఖ ప్రతిభతో రాణించాలన్నారు. పోటీ యుగంలో విద్యార్థులు కేవలం మార్కులు సాధిస్తే చాలదని నైపుణ్యం కూడా పెంచుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కఠినంగా శ్రమించాలని సూచించారు. ఇదే సందర్భంగా రిటైర్డు ఉద్యోగులను కూడా ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు రమేశ్, కార్యదర్శి రవీంద్ర, కోశాధికారి సుబ్రమణి, డైరెక్టర్‌లు మునిరాజు, మంజునాథ్, సరితా, అశోక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌లో రాణించిన విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, శాసనసభ సమావేశాలు ఏ విధంగా జరుగుతాయనేది విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు అంజలి కాన్వెంట్‌లో నిర్వహించిన మాక్‌పార్లమెంట్‌లో విద్యార్థులు రాణించారు. పాఠశాలలో వివిధ కమిటీలు ఏర్పాటు చేసి మంత్రివర్గ సభ, ప్రమాణస్వీకారం వంటి కార్యక్రమాలు జరిపారు. శాసన సభలో మంత్రులు ప్రమాణం చేసిన తరహాలోనే విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అంజలి కాన్వెంట్ సంస్థ అధ్యక్షుడు ఎస్‌జీ గౌడ, కార్యదర్శి సరళ, సాంస్కృతిక కమిటీ కార్యదర్శి లక్ష్మీ, ప్రభావతి తదితరులు పర్యవేక్షించారు.

రిటైర్డు ఉద్యోగికి ఆత్మీయ వీడ్కోలు



పిళ్ళప్పను సత్కరిస్తున్న గ్రామ ప్రముఖులు

శిడ్లఘట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి ప్రభుత్వ హైస్కూల్‌లో 16ఏళ్లపాటు డి గ్రూప్ ఉద్యోగిగా సుదీర్ఘసేవలందించి రిటైరైన పిళ్ళప్పను పాఠశాల ఆవరణలో ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. గ్రామానికి చెందిన సమాజసేవకుడు రవి బీ గౌడ ఆధ్వర్యంలో పిళ్ళప్ప, అక్కయమ్మ దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. రవి మాట్లాడుతూ డి గ్రూప్ ఉద్యోగిగా 2009 నుంచి 2025 వరకు సుదీర్ఘకాలం సేవలందించి వయో సహజంగా రిటైరైన పిళ్ళప్ప విశ్రాంతి జీవనం సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. పీడీఓ శైలా మాట్లాడుతూ అందరి తన పని తాను చేసుకుంటూ ఆదరణ పొందారని కొనియాడారు. గ్రామ ప్రముఖులు కృష్ణయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి తిమ్మేగౌడ, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మోహిమా బేగం, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ మహిళను ప్రేమించి..

జైలుపాలైన బీదర్ వాసి



బంగ్లాదేశ్ మహిళ, దత్తా యాదవ్

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ మహిళను ప్రేమించి బీదర్ జిల్లాకు చెందిన దత్తా యాదవ్ జైలు పాలయ్యారు. బంగ్లాదేశ్ మహిళ అక్రమంగా సరిహద్దు దాటి త్రిపుర రాష్ట్రంలోకి చేరుకోగా అక్కడ కలసిన బీదర్ వాసి అరెస్టు అయ్యాడు. బంగ్లాదేశ్‌లోని బోగ్రా జిల్లాకు చెందిన మహిళ వీసా లేకుండా త్రిపురకు చేరుకున్నారు. ఈ విషయం సరిహద్దు భద్రతా దళానికి సమాచారం అందింది. బంగ్లాదేశ్ మహిళతోపాటు దత్తాయాదవ్‌ను అదుపులోకి తీసుకుని త్రిపుర పోలీసులకు అప్పగించారు. వీరు అగర్తలా నుంచి బెంగళూరుకు ప్రయాణించేందుకు ప్రణాళిక వేసుకున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. 35ఏళ్ల మహిళ ముంబైలోని బ్యూటీ పార్లర్‌లోని, తర్వాత బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలోనూ పని చేసినట్టు గుర్తించారు. బెంగళూరులో పనిచేస్తుండగానే బీదర్‌కు చెందిన దత్తా యాదవ్‌ను కలిశారు. తొలుత స్నేహం కొనసాగినా ఆ తర్వాత ప్రేమికులు అయ్యారు. ఇటీవల సదరు మహిళ భారత్‌నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లారు. కొన్ని రోజుల తర్వాత బెంగళూరులో నివసిస్తున్న దత్తా యాదవ్, ఆమెను వాపసు రావాలని సూచించారు. అందుకు అనుగుణంగానే సరిహద్దు దాటి త్రిపురకు బుధవారం చేరుకుంది. ఈమెవద్ద పాస్‌పోర్ట్, వీసా లేకున్నా త్రిపుర రాష్ట్రంలోకి ప్రవేశించిన విషయాన్ని సరిహద్దు భద్రతా బలగాలు గుర్తించాయి. త్రిపుర రాష్ట్రం సెపహిజల జిల్లాలోని వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారు త్రిపుర నుంచి బెంగళూరుకు ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. ఈలోగానే అరెస్టు చేయడంతో వారిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. సదరు మహిళకు అక్రమంగా సరిహద్దు దాటేందుకు ఏజెంట్‌లు ఎవరనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్టు త్రిపుర రాష్ట్ర సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. వారిద్దరినీ సమగ్రంగా విచారణ జరపదలిచామన్నారు. దత్తా యాదవ్ త్రిపురలో అరెస్టు కావడంతో బీదర్‌లో సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే సదరు మహిళ బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు ఎన్నిసార్లు వచ్చి వెళ్లారు, ఆమెతోపాటు ఎంతమంది ఉన్నారనే కోణంలో త్రిపుర పోలీసులు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

లోక్ అదాలత్‌లో 788 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో న్యాయాధికారి మంజునాథాచారి తదితరులు

బాగేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తాలూకా న్యాయ సేవా సమితి, తాలూకా న్యాయవాదుల సంఘం, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల సహకారంతో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతమైంది. అదాలత్‌లో 788 కేసులు పరిష్కారమైనట్టు లీగల్ సర్వీసెస్ సెల్ మెంబర్ సెక్రటరీ, జేఎంఎఫ్‌సీ న్యాయాధికారి మంజునాథాచారి తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 1288 కేసులకుగాను 788 కేసులు రాజీ ద్వారా పరిష్కార మయ్యాయన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మంజునాథ, ఉపాధ్యక్షుడు సీ రవి, కార్యదర్శి జయప్ప, కోశాధికారి బిందూ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై దర్యాప్తునకు డిమాండ్




దళితసంఘాల ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా నిరసన

దొమ్మసంద్ర, జూలై 12(ఆంధ్రజ్యోతి): దళితుల భూములను అక్రమంగా ఆదేశించిన ఉపవిభాగాధికారి అపూర్వబిదరిని సస్పెండ్ చేయాలని ఆయన హయాంలో జరిగిన అన్ని అంశాలపై రిటైర్డు న్యాయమూర్తిచే దర్యాప్తు చేయించాలని కోరుతూ దళిత, ప్రగతిపర సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. శనివారం సమాఖ్య ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అవినీతి అధికారిని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. తాలూకాలోని వెంకటేశ్వర థియేటర్ నుంచి ఆనేకల్ తహసీల్దార్ కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించారు. దళితుల భూములను ల్యాండ్ డెవ లెపర్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఒక ఎకరాకు రూ.40లక్షలు వసూ లు చేస్తున్నారని, ఇంతటి అవినీతి అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సమాఖ్య అధ్యక్షుడు రావణ, వెంకటేశ్‌మూర్తి, ఆనంద్ చక్రవర్తి, నాగరాజ్ మౌర్య, హొసహళ్ళి నందకుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో మాక్ పార్లమెంట్

బాగేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో శనివారం మాక్‌పార్లమెంట్ నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగం, ఎన్నికల సరళి తదితర అంశాలను వివరించారు. మాక్ పార్లమెంట్ ఎన్నికల విజేతలకు జమేత్ ఉలేమా సంఘం ఆధ్వర్యంలో ధ్రువీకరణపత్రాలు అందచేశారు. ఇదే సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 110మంది విద్యార్థులకు తలా నాలుగు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత, జమేత్ ఉలేమాసంఘం అధ్యక్షుడు రిజ్వాన్ అహ్మద్, కరవే స్వాభిమాని వర్గం తాలూకా ఉపాధ్యక్షుడు జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



వీరాపురంలో సైబీరియన్ పక్షులు

నీలాకాశంలో ఎగిరిపోదామా..?

● స్వస్థలాలకు వెళ్లేందుకు సైబీరియన్ పక్షులు సిద్ధం ● పిల్లలకు శిక్షణ ఇస్తున్న తల్లి పక్షులు

చిలమత్తూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): సైబీరియన్ పక్షులు (పెయింటెడ్ స్టార్క్) తమ పిల్లలతో సందడి చేస్తున్నాయి. పురిటి కోసం సుదూర సైబీరియా ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఎర్రకాళ్ల కొంగలు కొమ్మరెమ్మలపై కిలకిల రావాలతో స్థానికులను అలరిస్తున్నాయి. వీరాపురం గడ్డపై పురుడు పోసుకున్న బుల్లి కొంగలు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. తల్లి ఇస్తున్న శిక్షణతో పిల్ల పక్షులు గాలిలో పైకి ఎగిరేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొత్తగా వచ్చిన రెక్కలతో ఒక చెట్టు నుంచి మరో చెట్టుపై వాలిపోతున్నాయి. ప్రతి ఏటా జనవరి రెండో వారంలో ఈ సైబీరియన్ పక్షులు వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు పురిటి కోసం వస్తుంటాయి. ఈ ఏడాది జనవరిలో సైబీరియన్ నుంచి విడిది కోసం వీరాపురం వచ్చినప్పుడు పక్షుల సంఖ్య 1500 నుంచి 2000 వరకు ఉండేది. సంతతి పెరగడంతో వాటి సంఖ్య మూడు నాలుగు వేలకు చేరింది. ఇప్పటికే పిల్ల పక్షులకు నడక నేర్పుతున్నాయి. గాలిలో ఎగిరే విధంగా శిక్షణ ఇస్తున్నాయి. ఇంతవరకు గూడులో ఉన్న పిల్లలకు తల్లి పక్షులే ఆహారం సేకరించి అందించేవి. అయితే ఇప్పుడిప్పుడే పిల్ల పక్షులు వాటంతట అవే ఆహారం తెచ్చుకోవడం ప్రారంభించాయి. తల్లి కొంగలు ఆహార సేకరణకు తమతో పాటు పిల్లలను తీసుకెళుతున్నాయి. దూర ప్రయాణానికి పిల్ల పక్షులు శక్తిని సంపాదించుకుంటే స్వస్థలాలకు బయల్దేరడానికి తల్లి పక్షులు సిద్ధమవుతున్నాయి.







తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.13	1,605.28
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	46,579	21.643
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	36,026	205
నీటి నిల్వ (టీఎంసీలు)	76.91	29.16



పురంధరదాసు మండపం వద్ద కనిపించిన మొసలి

వామ్మో.. మొసలి

కంప్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): హంపి పుణ్యక్షేత్రంలో తుంగభద్ర నది ఒడ్డున మొసలి కనిపించడంతో యాత్రికులు భయభ్రాంతులకు గురయ్యారు. శనివారం పురందరదాసు మండపం వద్ద నది ఒడ్డున పెద్ద మొసలి ప్రత్యక్షం కావడంతో పర్యాటకులు పరుగులు తీశారు. ఈ విషయం అక్కడున్న సిబ్బందికి తెలిపారు. వెంటనే అక్కడికి సిబ్బంది చేరుకుని యాత్రికులకు ధైర్యాన్ని ఇచ్చారు. అధికారులకు అధికారులు మాట్లాడుతూ నదిలో మొసలి వుండే ప్రదేశాల్లో నామఫలకాలు వుంచుతామని తెలిపారు. వీటిని పట్టి పార్కులో వదులుతామని పర్యాటకులకు అభయమిచ్చారు.

గ్రామస్థుల ఆందోళన



రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

బళ్లారి రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ తాలుకాలోని కారేకల్ గ్రామం నుంచి బళ్లారి వైపు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. శనివారం ఉదయం బళ్లారికి ఒకే బస్సు తిరుగుతున్న కారణంగా ఇబ్బంది పడుతున్నామని, మరో బస్సు సౌకర్యం కల్పించాలని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ అధికారులు ప్రజలు ఇబ్బందులను గమనించాలన్నారు. ఆలూరు వైపు నుంచి నిత్యం దాదాపు 30 నుంచి 40 బస్సులు వచ్చేవి. ఆంధ్రప్రదేశ్ చింతకుంట వద్ద వంతెన రిపేరీ ఉన్నందుకు కారణంగా బస్సులు రద్దు కావడంతో ఇబ్బంది ఏర్పడిందన్నారు. స్పందించిన అధికారులు త్వరలో ఇంకో బస్సు ఏర్పాటు చేస్తామన్నారు.

మహిళ ఆత్మహత్య



మాబమ్మ(ఫైల్)

రాయచూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సింధనూరు తాలూకా సెంట్రల్ సేట్ ఫార్మ 2 క్యాంపులో వివాహిత మహిళ శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక హుసేన బాషాతో సింధనూరు తాలూకానిలో చీరతనాళ గ్రామానికి చెందిన మాబమ్మ(26)తో నాల్గేళ్ల క్రితం వివాహం అయ్యింది. వారికి మూడేళ్లు, ఏడాది వయస్సుగల ఇద్దరు మగ పిల్లలున్నారు. గత కొన్నాళ్లుగా భార్య, భర్తల మధ్య తరచు గొడవ జరుగుతుండగా శనివారం భార్య, భర్తలిద్దరు తగువు పడి భార్య మాబమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురును వరకట్నం కోసం అల్లుడు ఆయన కుటుంబ సభ్యులు వేదిస్తున్నారంటూ మృతురాలు తండ్రి సాబణ్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బళగానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. భర్తతో పాటు ఆయన కుటుంబ సభ్యుల పై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

రాజీద్వారా కేసులు పరిష్కరించుకోవాలి

● జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి : జిల్లా సెషన్స్ న్యాయాధికారి కేజీ శాంతి

బళ్లారి సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాజీద్వారా పలు కేసులను పరిష్కరించుకోవచ్చని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెషన్స్ న్యాయాధికారి కేజీ శాంతి సూచించారు. శనివారం బళ్లారి, విజయనగరం జిల్లాలతో సహా మొత్తం 31కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని ఆమె తెలిపారు. నగరంలోని తాలూర్ రోడ్డులోని కొత్త జిల్లా కోర్టు సమాదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజీతో ఆర్థిక భారం, సమయం వృథా కాకుండా ఉండటానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. రాజీ ద్వారా కేసు పరిష్కారమైతే చెల్లించిన కోర్టు రుసుము పూర్తిగా తిరిగి చెల్లించబడుతుందన్నారు. బళ్లారి జిల్లాలో మొత్తం 69,354 వివిధ పెండింగ్ కేసులు ఉన్నాయని వాటిలో 19,784 పరిష్కరిచగల కేసులను ఇప్పటికే గుర్తించామని 11,931 కేసులను ఇప్పటికే పరిష్కరించామన్నారు. ఇందులో భూములకు సంబంధించిన వివాదాలు, ఇళ్ళు, ప్లాట్లకు సంబందించిన వివాదాలు, భూసేకరణ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ధరల దరఖాస్తులు లేబర్ కేసులు, ఇసుక అక్రమ రవాణా కేసులు,చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, వివాహ కేసులు పరిష్కారానికి అర్హమైన క్రిమినల్ కేసులు వంటి అనేక కేసులను పరిష్కరించేందుకు గుర్తించామన్నారు. ప్రతిరోజు మధ్యవర్తిత్వం కోసం ఎంపిక చేయబడిన కేసులను సంబందిత న్యాయవాదులు, పార్టీలతో మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ముందుగానే చర్చిస్తారు, రాజీ చర్యలు జరపడానికి వారిని ఒప్పించడానికి 67మంది మధ్యవర్తులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. జూలై 13 నుంచి నేషన్ కోసం మీడియేషన్ క్యాంపెయిన్ కింద నిర్వహించబడే



మాట్లాడుతున్న న్యాయాధికారులు శాంతి, రాజేశ్ హొసమనె

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల్లో పాల్గొన్న న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొని రాజీ ద్వారా తమ వివిదాలను పరిష్కరించుకోవాలని , సమాచారం కోసం వారు జిల్లా లీగల సర్వీసెస్ అథారిటీ ,తాలూకా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయాలను సందర్శించవచ్చన్నారు. సుప్రీంకోర్టు జూలై 11నుంచి అక్టోబర్ 7వరకు ప్రత్యేక లోక్‌అదాలత్‌ను నిర్వహించాలని పార్టీలు మధ్యవర్తిత్వం ద్వారా ప్రత్యర్థి పార్టీల లోక్ అదాలత్‌ను నిర్వహించడానికి వీడియో కాన్ఫరెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబందించిన వివిధ కేసులు కూడా సుప్రీంకోర్టులో ఉన్నాయి. లోక్ అదాలత్ రాజీ కోసం వీటిని కూడా పరిగణించినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి , సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె తదితరులు పాల్గొన్నారు.

రైతులు, సైనికులను గౌరవించాలి

● హంపినవీర మఠాధిపతి వామదేవ శివాచార్యులు



మాజీ సైనికుడు షేక్‌సాబ్‌ను సత్కరిస్తున్న వామదేవ శివాచార్యులు

కంప్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమాజంలో రైతులు, సైనికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మిగనూరు హంపినవీర మఠానికి చెందిన వామదేవ శివాచార్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి గురుసిద్దలింగ మహంతరు 24వ సంస్మరణ సందర్భంగా ఎమ్మిగనూరులోని హంపినవీరదేవర మఠంలో పలువురు రైతులు, సైనికులను మఠం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ రైతులకు ఎరువులు విత్తనాలు అందిస్తే ఇది సరిపోదు పంటకు సరైన ధర ఇవ్వాలన్నారు. రైతులను గౌరవంగా చూసుకోవాలని, అందరికీ అన్నం పెట్టడం రైతు పని అయితే, దేశాన్ని రక్షించే సైనికుడు గొప్పవారేనన్నారు. శాలిగనూరుకు చెందిన రైతు శ్రీనివాస తిప్పన్న వడ్డెర ఎమ్మిగనూరుకు చెందిన మాజీ సైనికుడు షేక్‌సాబ్, చిత్రశేఖర్ శివాచార్యులు, బెంగళూరుకు చెందిన విమల, రేణుక వీరముక్తి శివాచార్యులు ఉరవకొండకు చెందిన డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామిజీ, హెబ్బాళ నాగభూషణ శివాచార్యులు, మరియమ్మనహళ్లిలోని మల్లికార్జున శివాచార్యులను సత్కరించారు. అంతకుముందు రెండు జంగమావతులను ప్రారంభించారు. శివశక్తి అక్కన్న బలగాన్ని మాజీ నేత అల్లం వీరభద్రప్ప మాడి గాలి సోమశేఖర్‌రెడ్డి, హర్లాపూర్‌లో ప్రముఖులు మల్లికార్జున, మసిదీపూర్‌లో చంద్రశేఖర్‌గౌడ, మల్లనగౌడ, రాజశేఖర్ గౌడ, బి సదాశివప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'గురువందన'



గురువులను సత్కరిస్తున్న శ్రీనంద పీయూ కాలేజీ అధ్యక్షుడు గాంధీ

బళ్లారిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని శ్రీ నంద పీయు కాలేజీ ఆధ్వర్యంలో అఖిల భారత సాహిత్య పరిషత్ 'గురువందన' కార్యక్రమం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యక్షుడు వి గాంధీ నేతృత్వంలో పలువురు గురువులను సన్మానించారు. గురువులు హరికుమార్ ప్రిన్సిపాల్ శశికుమార్ సుబ్బారెడ్డి, జరీనాభాను, మల్లికార్జున గౌడ, వినయ్‌చౌదరి ముఖ్య ఉపాధ్యాయురాలు సరిత, జయశ్రీలను అఖిల భారత సాహిత్య పరిషత్ అధ్యక్షులు శశికుమార్ నేతృత్వంలో సత్కరించారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీమతి సత్యవాణి నగర అధ్యక్షుడు శ్రీనాథ్ జోషి, హరికుమార్, పుష్ప, సునీత పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలని వినతి

కంప్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి) : హుబ్లీ నరసాపురం వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు దరోజీలో స్టాప్ ఏర్పాటు చేయాలని సమాజ సేవకుడు దరోజీ గురుమూర్తి కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గంగావతి, కంప్లి ఘటనతో పాటు క్యాంపుల వారికి అనుకూలం అవుతుందన్నారు. దరోజీకి స్టాప్ లేకపోవడంతో బళ్లారి, హోస్పేట, తోరణగల్లు వెళ్లవలసి వస్తుందన్నారు. స్థానిక నాయకులు అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులు లేక ఆగిన ఉపకాలవల అభివృద్ధి



చెత్తాచెదారంతో నిండిపోయిన సన్నాపురం ఉపకాలువ

కంప్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ, ఎల్‌ఎల్‌సీ, దరోజీ చెరువు కింద బాగావడే ఉప కాలువలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. చిన్న నీటి పారుదల శాఖ నిధులు మంజూరు కాకపోవడంతో గత మూడు సంవత్సరాలుగా ఉపకాలువల్లో చెత్త పూడుకుపోయింది. రైతులకు సక్రమంగా నీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప కాలువల్లో చెత్త తొలిగించాలని ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతు సంఘం నాయకులు వాపోతున్నారు.

నిధులు మంజూరు కావడం లేదు: శ్రీనివాస్, ఏఈఈ



ఉప కాలవల్లో పరిశుభ్రతా చర్యలపై కంప్లి చిన్ని నీటిపారుదల శాఖ ఏఈఈ అధికారి శ్రీనివాస్ ప్రశ్నించగా 2011 సంవత్సరం వరకు ఒక డివిజన్‌కు రూ. 40 లక్షలు నుంచి రూ. 50 లక్షలు మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసేదన్నారు. ఆ తర్వాత నిధులు రావడం లేదన్నారు. హెచ్చెల్సీ కింద భాగాన ఏడు డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువలు, దరోజీ చెరువు కింద మూడు డిస్ట్రిబ్యూటరీలు ఉప కాలువలు అలాగే ఎల్‌ఎల్‌సీ కింద భాగాన పది డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయన్నారు. కొన్ని కాలువలు రైతుల ముందుకొచ్చి వారే సొంతంగా కాలువలు పరిశుభ్రం చేసుకుంటు న్నారన్నారు. తమ వంతుగా సహాయదనం అందించామన్నారు. నిధులు మంజూరయ్యేవరకు కాలవల్లో అభివృద్ధి కష్టమేనన్నారు. కంప్లి సబ్ డివిజన్‌లో ఉన్న 80 మంది సల్కర్లతోనే కాలువలో జంగిల్ షెల్టు కొంతవరకు శుభ్రం చేయిస్తున్నామన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు నీరు రాకముందే తమ ఉపకాలువలను పరిశీలించామని, ఎక్కడైనా కాస్త సమస్య ఉన్న చోట ఆ ప్రాంతంలో పనులు జరిపి నీరు సక్రమంగా వెళ్లేలా చేపట్టామన్నారు.



మిల్లర్‌పేటలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మున్సిపల్ సమ్మెతో నగరం అపరిశుభ్రం

బళ్లారి సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్‌ఉద్యోగులకు ఏడవ వేతన సంఘం వేతన సంఘం సిఫార్సులను అమలు చేయడం సహా అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. కార్మికుల సమ్మెతలో ప్రజాజీవనానికి ఇబ్బందులు తప్పడం లేదు. బళ్లారితో సహా రాష్ట్రంలోని 10 కార్పోరేషన్ల అధికారులు సిబ్బంది నిరసనలో పాల్గొంటున్నారు. సాధారణ పనులు నిలిచిపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. చెత్త తొలగింపు సరిగ్గా జరగడం లేదు. నాలుగు రోజులుగా ఇళ్ల మధ్యే చెత్త ఉండిపోయింది. చెత్త కుళ్ళిపోయి దుర్వాసన వస్తోంది. మూసుకుపోయిన మురుగు కాలువలు, మ్యాన్‌హోళ్ళను మరమ్మతు చేయడానికి మున్సిపల్ కార్మికులు రావడంలేదు. కార్పోరేషన్ ఉద్యోగుల సమ్మె నగర ప్రజలజీవితాన్ని అస్తవ్యస్తం చేసింది. చెత్త తెలగింపు మురుగునీని సమస్యలు నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు లేవు. ప్రభుత్వం వెంటనే దృష్టిపెట్టాలని స్థానికులు, బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్‌లో ప్రతిపక్ష నాయకుడు ఇబ్రహీం కోరారు.

ఎరువుల ధర పెంపుపై యూత్ కాంగ్రెస్ నిరసన



నిరసనలో కాంగ్రెస్ నాయకులు

రాయచూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు వినియోగించే రసాయనిక ఎరువుల ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని యూత్ కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎద్దుల బండ్ల పై ప్రధాని నరేంద్ర మోదీ ఎరువులు, రసాయన శాఖల మంత్రి జేపీ నడ్డా నమూనాల ముఖాలను ధరించిన వ్యక్తులను చర్నా కోలలతో కొడుతూ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కిసాన్ సమ్మాన్ పేరుతో మూడు విడతలుగా ఈ ఏడా ఆరు వేలు కేవలం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం అంతకు రెండింతలు వసూలు చేయడమే లక్ష్యంగా ఎరువుల ధరలను పెంచినట్లు ఆరోపించారు. కాగా ఇప్పటికే సాగు వ్యయం విపరీతంగా పెరిగి రైతులు గిట్టుబాటు ధరలు లభించకా నష్టాల పాలవుతూ అప్పుల పాలవుతున్న నేపథ్యంలో ఎరువుల ధర పెంచడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉప సంహరించుకుని రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా గతంలో ఉన్న వివిధ రకాల ఎరువులు పెరిగిన ధరలను వివరిస్తూ ప్రజలకు ముఖ్యంగా రైతులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా బసవరాజ్



బసవరాజ్‌ను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

హోస్పేట,జూలై12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కమలాపుర్ పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలకు ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా బసవరాజ్ ఎన్నికయ్యారు.ఈ కమిటీలో మొత్తం 9మంది సభ్యులు ఉండగా అందులో 25 మంది సభ్యత్వం కోరుతూ తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఎస్సీ కేటగిరిలో 8మంది సభ్యత్వ ఆశావహులు చేతులు ఎత్తడంతో అయోమయంలో పడిన పాత సభ్యులు చేతులు పైకెత్తి లాటరీ తీసి కొత్త సభ్యులను ఎంపిక చేశారు. అప్పుడు ఎన్నికైన ఎనిమిది మంది సభ్యులు ఏకగ్రీవంగా ఓటు వేసి చేతులెత్తి ఎం బసవరాజ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎస్‌డీఎంసీ మాజీ అధ్యక్షుడు బీఎన్ హులుగప్ప మాట్లాడుతూ ఎస్‌డీఎంసీ అధ్యక్షుడైన తరువాత మన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించాలని, అభివృద్ధి పనులలో వెనుకాడని అధికారుల వద్దకు వెళ్లాలన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ఏదైనా త్యాగం చేయడానికి సిద్దంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌డీఎంసీ సభ్యులు హెచ్ తిప్పేస్వామి, తాయమ్మ, పక్కీరమ్మ, కే తిప్పేస్వామి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు పీ రవికుమార్, ఎస్‌డీఎంసీ మాజీ అధ్యక్షుడు కమీల్‌వీరేష్, తదితరులుపాల్గొన్నారు.

కేఈబీ రుద్రప్పకు 'కాయక రత్న' అవార్డు



అవార్డు అందుకుంటున్న రుద్రప్ప

బళ్లారిసిటీ,జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ హోటల్ హాల్లో శనివారం కేఈబీ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి , కార్మికనాయకుడు జి.రుద్రప్పను 'కాయక రత్న' అవార్డుతో సత్కరించారు. కర్ణాక ఇతిహాస(చరిత్ర)అకాడమీ జిల్లాధ్యక్షుడు టి.హెచ్.ఎం.బసవరాజ్ ఆయనున సత్కరించి మాట్లాడారు. తన 80ఏటా కూడా ఆయన సమాజానికి ,కార్మికులకు సేవ చేస్తున్నారని ,40ఏళ్ల బాలుడిలా ప్రతి సమావేశంలో దేవుని నామాలను పాడుతున్నాడన్నారు. వాహనం లేకుండా ఎంతో ఉత్సాహంగా బస్సులో ప్రయాణిస్తున్నారన్నారు. అందరి ప్రేమను సంపాదించుకున్న రుద్రప్ప ప్రత్యక్ష నిరంతర పోరాటం నుంచి వచ్చారన్నారు. ఈసందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి హొన్నూరప్ప, విశ్వనాథ్, బండెప్ప , శివలింగం,గూళ్యప్ప, బహదూర్ వంటి సీనియర్ నాయకులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్

ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

బళ్లారి సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌యూఐ) బళ్లారి జిల్లా కమిటీ కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ ప్రారంభం అయ్యింది. శనివారం జిల్లా కమిటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక ప్రక్రియ జరగడం ఇదేమొదటి సారి. ఈ ప్రక్రయ జూలై 16వరకు కొనసాగుతుంది. బళ్లారి జిల్లా మొత్తం నుంచి ఆసక్తి ఉన్న విద్యార్థులు బళ్లారి జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించి తమ దరఖాస్తులను సమర్పించవచ్చునని కాంగ్రెస్ జిల్లాధ్యక్షుడు అల్లం ప్రశాంత్ ఈ సందర్భంగా తెలిపారు.

హోసూరు జోన్

233 కిలోల గుట్కా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా, నిందితుడు తిరుసెంథిల్

హోసూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హోసూరు మీదుగా కరూర్‌కు అక్రమంగా తరలిస్తున్న గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూజువాడి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ వేళ ఒక కారులో 233 కిలోల గుట్కాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు డ్రైవర్‌ను అరెస్టు చేసి మరో ఇద్దరు వ్యక్తుల కోసం గాలింపులు చేపట్టారు. నిందితుడు కరూర్ జిల్లాలోని కృష్ణరాయపురంనకు చెందిన తిరుసెంథిల్ (33)గా గుర్తించారు. కాగా కెలమంగలం పోలీసులు బరందూరు జంక్షన్‌లో గస్తీ నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి నుంచి 17 కిలోల పొగాకు ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇతను డెంకణీకోట తాలూకా పాలయం కొట్టై ప్రాంతానికి చెందిన అబుసలిషా(24)గా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి ద్విచక్రవాహనం కూడా స్వాధీనం చేసుకున్నారు.

పురాతన మురుగన్ విగ్రహం లభ్యం

హోసూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): సూళగిరి సమీపంలోని దురై సరస్సు ఒడ్డున సుమారు వెయ్యి సంవత్సరాల పురాతన విగ్రహం లభించినట్టు చారిత్రక పరిశోధన కేంద్రం ప్రకటించింది. పరిశోధన కేంద్రం చైర్మన్ అరమ్ కృష్ణన్ మాట్లాడుతూ ఎండిన చెట్టు మొదట్లో విగ్రహం లభించిందన్నారు. ఈ ప్రాంతం వందల ఎకరాల భూమి జమీందార్ల అధీనంలో ఉండేదని, ఇక్కడి సరస్సును దురై సరస్సు అని పిలుస్తారన్నారు. విగ్రహం లభించిన సరస్సుకు అవతలివైపు సాగు భూమి ఉందన్నారు. మురుగన్ రాతి విగ్రహం ఎండిన చెట్టుమూలాలో ఇరుక్కుపోయిందని, విగ్రహం చేతులు, కాళ్లు దెబ్బతిన్నాయన్నారు. నెమలి తల మాత్రమే చెట్టు లోపల ఇరుక్కుపోయిందన్నారు. మరింత పరిశీలన చేస్తున్నామన్నారు. స్థలాన్ని కన్నన్, జనార్ధనన్, చిన్నప్పన్, చేరన్ మునిరాజ్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.



చెట్టులో లభించిన పురాతన విగ్రహం

సభ్యత్వ నమోదును సత్వరం పూర్తి చేయండి : సీఎం

చెన్నై, జూలై 12(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ సభ్యత్వ కార్యక్రమాలను వీలైనంత త్వరగా ముగించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాలిచ్చారు. పార్టీ ప్రధాన కార్యాలయం అరివాలయంలో 'ఉడన్ పిరప్పేవా' (తోబుట్టువా రా) పేరుతో శాసనసభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జిల్లా కార్యదర్శులతో ఆయన వరుసగా సమావేశమవుతున్నారు. ఆ మేరకు దిండుగల్, వేడచందూరు, వేప్పనహళ్ళి నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి ఆర్.చక్రపాణి, దిండుగల్ తూర్పు జిల్లా శాఖ కార్యదర్శి ఐపి సెంథిల్‌కుమార్, కృష్ణగిరి వెస్ట్ జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఒక్కో నియోజకవర్గం ఇన్‌ఛార్జితో ఆయన గంటసేపు ఆయన సమావేశమయ్యారు. ఆ తర్వాత మూడు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో సమావేశమై ఆయా



దిండుగల్ ఇన్‌చార్జితో చర్చిస్తున్న సీఎం స్టాలిన్

నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, సభ్యత్వ కార్యక్రమాలు జరుగుతున్న తీరు తెలుసుకున్నారు. ఈసారి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు మునుపటి మెజారిటీ కంటే రెట్టింపు మెజారిటీతో గెలిచేందుకు ఇన్‌ఛార్జులు, జిల్లా కార్యదర్శులు, తీవ్రంగా కృష చేయాలని, పార్టీ అధ్యక్షుడిగా తానిచ్చిన పిలుపుమేరకు 200లకు పైగా నియోజకవర్గాలలో డీఎంకే కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన కలెక్టర్

హోసూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా బస్టాండ్ సమీపంలో దెబ్బతిన్న పై ఓవర్ మరమ్మతు పనులు, సిప్‌కాట్ జంక్షన్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన హైలెవెల్ పై ఓవర్ పనులు, పాత మునిసిపాలిటీ కార్యాలయం నుండి హోసూరు కార్పొరేషన్ కార్యాలయం వరకు రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ దినేశ్‌కుమార్ శనివారం పరిశీలించారు. బాగలూరు రోడ్డులో పాత మునిసిపాలిటీ కార్యాలయం నుంచి హోసూరు కార్పొరేషన్ కార్యాలయం వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరానికి రూ.12.80 కోట్లు అంచనాగా వేశారు. రోడ్డు పక్కన డ్రైనేజీ పనులు, రోడ్డుపై చిన్న వంతెనల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. కలెక్టర్ వెంట జాతీయ రహదారుల ప్రాజెక్టు అధికారి రమేశ్, జాతీయ రహదారుల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పద్మావతి, అసిస్టెంట్ ఇంజనీర్ నివేత తదితరులు ఉన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్